ఓం నమోభగవతే శ్రీరమణాయ

ఉమా సహస్రము

(సప్తమ శతకము – ద్వితీయ స్తబకము)

షడ్వింశస్తబకము

అవ:- ఈ యిరువదారవ స్తబకమున, అరుణాచల క్షేత్రమున ప్రసన్నయగు అపీతకుచాంబికను స్తుతించుచున్నాఁడు.

మూ॥ ఆగమవిస్మృతి కైర విణీనాం
బోధమజస్ర మసౌ విదధానః
పాతుమహేశ వధూవదనాంశో
హాసశశీసకలానికులాని. 1

వేదాదులగు ప్రమాణ శాస్త్రజ్ఞుల బుద్ధులను కలువపూవులకు – నిత్యము, బోధమును, వికాసమును, కలిగించు మహేశ్వరీ ముఖమండల కలయగు హాసచంద్రుఁడు కులముల నన్నింటిని రక్షించుఁగాత!

ప్రభ:- ఇచ్చట 'హాసచంద్రుఁడు' అనుచోట ''హాసమేయగు చంద్రుఁడు'' అని మయూరవ్యంసకాది సమాసాశ్రయణము వలన పరిణామ మలంకార మగుచున్నది. ఇచట – ఆరోపింపఁదగిన చంద్రుఁడు, ఆరోప విషయమగు హాసరూపమున పరిణామము నొందని యెడల – సకల కులరక్షణోపయోగి కానేరఁడు.

ప్రశ్న:- 'హాసము – చంద్రునివలె' అని ఉపమిత సమాసాశ్రయణము వలన పూర్వపదమగు హాసమునకు ప్రాధాన్యము కలుగదా?

ఉ:- ''ఉపమితం వ్యాఘ్రాదిభిస్సామాన్యాప్రయోగే'' అను వ్యాకరణానుశాసనము వలన సామాన్య ధర్మము ప్రయోగింపఁబడనప్పుడే, ఉపమిత సమాసమాశ్రయింప వలయును. ఇచ్చట 'బోధమును కలిగించువాఁడని' సామాన్యధర్మము ప్రయోగింపఁబడినది. కావున ఉపమిత సమాసము నాశ్రయింపఁగూడదు. కావున ఉత్తరపదమును విషయియునగు చంద్రునకు ప్రకృత విషయమగు హాసరూపమున పరిణామమును వారించుటకు శక్యము కానేరదు. కనుక – పరిణామమే – అలంకారము.

మూ॥ ఆయతలోచన చుమ్బితకర్ణా
దానయశోజిత తోయదకర్ణా
శోణనగేశమనః ప్రియవర్ణా
నాశయతాజ్జగదార్తి మపర్ణా. 2

శ్రోత్రములను చుంబించుచున్న దీర్ఘములగు లోచనములు గలదియు, దానముచేతఁ గలిగిన యశస్సు చేత– తోయదము వంటి కర్ణుని జయించినదియు, అరుణాచలేశ్వరుని మనస్సునకు ప్రియమగు వర్ణము (రాగము) గలదియు, అగు అపర్ణ (దుర్గ) జగత్తునందలి యార్తిని తొలఁగించుఁగాత!

ప్రభ:- ఆకర్ణాంత విశాల నేత్రయు, కర్ణయశోతిశాయినియు, అరుణాచలేశ్వర హృదయరంజనియు, అగు దుర్గాదేవి – లోకమునందలి పీడను ధ్వంసమొనర్చుఁగాతమని తాత్పర్యము.

మూ॥ వేదతురఙ్గ విలోచన భాగ్యం
వేద శిరోనిచయై రపిమృగ్యమ్
శోకవిదారి సుధాకిరణాస్యం
శోణగిరౌ సమలోకి రహస్యమ్॥ 3

వేదములు గుఱ్ఱములుగాఁగల శివుని యొక్క నేత్రములకు భాగ్యమును, వేదశిరో (వేదాంత) నివహముల చేత (ఉపనిషత్తుల చేత) మృగ్యమును, శోకమును విదళించునదియగు సుధాంశుని వంటి ఆస్యముగలదియు అగు 'రహస్యమును' (గూఢమగుతత్త్వమును) నేనరుణాచలమునం దవలోకించితిని.

ప్రభ:- భాగ్యమనఁగా; పుణ్యఫలము. మృగ్యమనఁగా, వెదుకఁదగినది. రహస్యమనఁగా, పరమేశ్వరీ స్వరూపము. ఈ మహాయోగి నిగూఢమగు పరమేశ్వరీ స్వరూపము నరుణాచలమున సందర్శించెనని భావము.

మూ॥ ముఙ్మసమస్త మనోరథలాభే
సంశయమద్య కరామలకాభే
దృక్ పథమాప నగేన్ద్రతనూజా
సోఽహమితః పరమన్తర రాజా॥ 4

ఓ మనసా! నగరాజకుమారి నా దృష్టిపథము నొందినది. (సాక్షాత్కరించినది) కావున సర్వమనోరథ లాభము – నీకు హస్తామలకాభము. కావున నిప్పుడు సమస్త కామ సిద్ధివిషయమున సంశయమునుడుగుము. నేనిఁక ముందు హృదయ రాజానగుచున్నాను.

ప్రభ:- హస్తామల కాభము = చేతియందున్న యుసిరిక పండువంటిది. సర్వ కామప్రాప్తి – సులభసాధ్యమని భావము. 'హస్తామలకము వంటిదను లోకోక్తి నిచట నుపయోగించుట వలన నిది – లోకోక్తియను నలంకారమగుచున్నది. 'హృదయరాజానగుచున్నాను' అనఁగా 'హృదయమును శాసించువాఁడ నఁగుచున్నాను' అనియు, 'హృదయము – రాజుగాఁ గలవాఁడ నగుచున్నాను' అనియు అర్థద్వయము నెఱుఁగునది. నేనిఁక బాహ్యావశంగతుఁడనై యితరుల కధీనుఁడను వాఁడను గానని భావము. సాక్షాత్కారమే దీనికిఁగూడ – హేతువని గ్రహింపనగును.

ఇందు దుష్కరమగు సమస్తమనో రథ లాభము – సమర్థనము నపేక్షించుచున్నది. పార్వతీ దర్శనలాభముచే నది సమర్థింపఁబడినది. కావున నిది వాక్యార్థహేతుకమగు కావ్యలింగాలంకారమని తెలియునది.

మూ॥ శిల్పవిదః ప్రతిమాం ప్రవిశన్తీ
స్వల్పవిదాం తరణాయచకాస్తి
శోణధరాభృతి సమ్ప్రతి లబ్ధా
హన్త! చిరాదియమేవ మమామ్బా॥ 5

శిల్పకలావిదుని చేత నిష్పాదితమగు ప్రతిమయందు స్వీయమగు అంశము చేత ప్రవేశించిన పరమేశ్వరి – వేద – వేదాంతాది పాఠముల చేత సంస్కృత బుద్ధులు కాని మందజ్ఞానులను జననమరణ ప్రవాహము నుండి తరింపఁజేయుటకై వెలయుచున్నది. **చిరకాలము నుండియు తెలియదిబడని యీయమ్మయే - అరుణాచలమునందిప్పుడు నాకు సాక్షాత్కరించినది.** ఆశ్చర్యము!

ప్రభ:- ఈయమ్మ నెఱుఁగకయే యింత కాలము వఱకు జీవితమును వ్యర్థముగాఁ గడపితిని. ఇప్పుడెఱిఁగి – కృతకృత్యుఁడనైతినని భావము.

మూ॥ భారతభూవలయేఽత్రవిశాలే
సన్త్వనఘాని బహూని గృహాణి
ఆస్యవిగీత సుధాకరబిమ్బా
శోణగిరౌ రమతేఽత్ర మదమ్బా॥ 6

విశాలమగు నీ భారత భూవలయమునందు దేవి నివసించుటకు అనేకము లగు నాలయములుండిన నుండుగాక! అయినను – **ఈయరుణాచలము నందే, చంద్ర బింబమును నిందించు ముఖబింబము గల మాయమ్మ - యాసక్తిని వహించుచున్నది.**

ప్రభ:- ఈ భరతఖండమున పావనములును, రమణీయములును, అగు దేవ్యాలయము లసంఖ్యాకములుగా నున్నవి. అయినను ఈ యరుణాచలమునందే యాపరమేశ్వరి - సోల్లాసయు, సుప్రసన్నయునై వెలయుచున్నదని భావము.

మూ॥ వారితసంశ్రిత పాతకజాలా
వారిధివీచిని రఞ్చ్కశలీలా
వారిజపత్ర విడమ్బననేత్రా
వారణ రాజముఖేనసపుత్రా॥ 7

ఆశ్రితజనుల పాపజాలమును నివారించునదియు, సముద్రోర్ములవలె నిరంకుశములగు లీలలు గలదియు, కమల దళముల నవహసించు నేత్రములు గలదియు, గజముఖుని చేత పుత్రవతియు, (అగుతల్లి మాకు శరణము)

ప్రభ:- మీది శ్లోకార్థమునకు తరువాతి శ్లోకార్థముతో నన్వయము నెఱుంగునది.

మూ॥ ఆయతవ క్రఘనాసిత కేశీ
తోయజ బాణ రిపోర్హృదయేశీ
కాశ సుమాచ్ఛయశాః పరమైషా
పాశ భిదస్తుత వేన్దువిభూషా॥ 8

దీర్ఘ - కుటిల- సాంద్ర - కృష్ణ - కేశములు గలదియు, కమల పుష్ప బాణుఁడగు మన్మథునికి శత్రువగురుద్రునికి హృదయేశ్వరియు, కాశ (రెల్లు) పుష్పము వలె తెల్లనిదగు కీర్తి గలదియు, చంద్రుఁడు శిరో భూషణముగాఁగలదియు శ్రేష్ఠయు నగు నీజగదంబ - నీయొక్క పాశమును ఛేదించుఁగాత!

ప్రభ:- సంశ్రితపాప నివారిణియు, విశృంఖల నవనవోన్మేష విలాసి శాలినియు, కమల శోభాతిశాయి నేత్రయు, గణపతిజననియు, దీర్ఘ - కుటిల - సాంద్ర వినీలకేశియు, కాశకుసుమ శుభ్రకీర్తియు, చంద్రచూడయు, పరమయు నగు జగదంబ అవిద్యకమగు నీజన్మ బంధమును ఛేదించుగాత! అని పూర్వోత్తర శ్లోకార్థ సమన్వయమును గ్రహించునది.

మూ॥ పఙ్కజ సమ్భవ పూజిత పాదా
పఙ్క వినాశన పావననామా।
కిఙ్కర కల్పలతా పరమేయం
శఙ్కర నేత్ర సుధాశరణం నః॥ 9

బ్రహ్మదేవుని చేత పూజింపఁబడిన పాదములు గలదియు, పాపమును నశింపఁజేయునదియగు పవిత్రనామము గలదియు, సేవకులగు భక్తుల కిష్టార్థములు నిచ్చునదియు, శంకరలోచనముల కమృతాయ మానయు, అగు తల్లి! మాకు రక్షణమగుచున్నది.

మూ॥ చఞ్చల దృగ్ విన తామరవల్లీ
పఞ్చ పృషత్కశరాసన ఝిల్లీ
కాఞ్చన గర్భముఖ ప్రణుతేయం
పఞ్చముఖ ప్రమదా శరణం నః॥ 10

విలాస విశేషము చేత చలించుచున్న దృష్టులు గలదియు, పంచబాణుని శరాసనమగు (విల్లయిన) భ్రూలతలు గలదియు, హిరణ్య గర్భాదుల చేత ప్రస్తుతింపబడునదియు, పంచముఁడగు పరమేశ్వరునకు ప్రమదయు, నగు పరమేశ్వరి - మాకు రక్షణమగుచున్నది.

ప్రభ:- ఈశాన - తత్ పురుష - అఘోర - వామదేవ - సద్యోజాత - నామములు పంచముఖములు గల పరమేశ్వరుఁడు - పంచముఖుఁడు.

మూ॥ అమ్బ! విధూయ భటాన్ మదనాదీన్
నూపుర నాదభీషికయైషః
హన్త! జహార బలేనమనో మే
శోణనగా(ఙ్ఞనివేశిని! తేఽ(ఙ్ఘిః 11

అమ్మా! శోణాచలపాద ప్రదేశవాసినీ! నీయీపాదము - నూపుర నాదబిభీషిక చేత (పాద కటక ధ్వనిచేత) కామాదులగు భటులను తొలఁగించి, స్వయముగానే నామానసమును బలముచే నాకర్షించినది. ఆహా!

ప్రభ:- మదనాదుల చేత రక్షింపఁబడిన నా మనస్సు - నీ పాదము నొందుటకు నిరవకాశమై యుండెను. నీ పదకటక ధ్వనిచేత - వారిని తరిమివైచి, తథావిధమగు నామానసమునపహరించితివి! నీ పాద మహిమ - ఎంతయాశ్చర్యదాయకము! అని భావము.

మూ॥ కర్ణపుటే కురుముగ్ధ! మమోక్తిం
ముఞ్చధనాదిషు మానససక్తిమ్।
శోణగిరీంద్ర వధూపదభక్తిం
శీలయశీలయ యాస్యసిముక్తిమ్॥ 12

మూఢమానసమా! నామాట వినుము, ధనకాంతాదివిషయ భోగములయందాసక్తి నుడుగుము. (సంగము విడువుము) అరుణాచలేశ్వర వధూపద భక్తిని ఆచరింపుము. ఆచరింపుము. మోక్షము నొందుదువు.

మూ॥ జీర్ణతరే జరయాఖిల దేహే
బుద్ధిబలంచ విలుమ్పతిమోహే
హన్త! సవి(త్రి! తపస్మతిరస్తే
సేవితుమిచ్ఛతి నా చరణం తే॥ 13

సవిత్రీ! శరీరమంతయు వయోవృద్ధిరూపమగు ముసలితనము చేత - మిక్కిలి జీర్ణమగునపుడు, మోహము - (జ్ఞానలోపము) బుద్ధిబలమును క్షీణింపఁజేయునపుడు, దేహావసాన సమయమున, అయ్యో! పశ్చాత్ తాపార్తమగు బుద్ధిగల మర్త్యుఁడు - నీచరణమును సేవింపఁగోరుచుండును.

ప్రభ:- శరీరేంద్రియములు బలిష్ఠములై యున్నపుడు ప్రాయశః మనుష్యునకు నీచరణ సేవ యందాసక్తి కలుగుటలేదు. ఇది శోచనీయమయిన కష్టమని భావము.

మూ॥ తన్త్రవిదో నవయోనితుచక్రం
శోణధరాధరరూపము శన్తి।
అర్ధమముష్యవ పుర్మదనారే
రర్ధమగేన్ద్రసుతే! తవగాత్రమ్॥ 14

తంత్రవిదులు (శాక్తాగమముల నెఱిఁగినవారు) నవయోని యగు శ్రీచక్రమునే - అరుణాచల రూపమునుగా చెప్పుచున్నారు, పార్వతీ! శ్రీ చక్రరూపమగు నీయరుణగిరి యందలి యర్ధభాగము - శివ శరీరము. అర్ధభాగము- నీ శరీరము.

ప్రభ:- తంత్రశాస్త్రముల యందు శ్రీపురమని విశ్రుతమగు శ్రీచక్రమే - అరుణాద్రిరూపమున విరాజిల్లుచున్నదని చెప్పుచున్నారు. ఆయరుణాచలము నందర్ధ భాగము నీవును, అర్ధభాగము - శివుఁడును, అగుదురని కూడ చెప్పవలసియున్నది. శ్రీచక్రమంతయుఁగూడ - నీ శరీరము కానట్లు, అరుణాచలమంతయు - శివశరీరము కాదు.

చతుర్భిః శివచక్రైశ్చ శక్తి చక్రైశ్చ పఞ్చభిః
నవయోన్యాత్మకంచక్రం శ్రీచక్రం శివయోర్వపుః॥

'నాలుగు శివ చక్రములతోడను, అయిదు శక్తి చక్రములతోడను, గూడి – నవయోని స్వరూపమగు చక్రమగు శ్రీచక్రము – ఉమామహేశ్వర శరీరము" అను ప్రమాణము వలన – శ్రీ చక్రమేయగు అరుణాచలమంతయు శివశరీరమనుట సత్యము కానేరదు. అందు నీ శరీరభాగముకూడ నున్నదని భావము.

మూ॥ అస్తునగేశ్వరనన్దిని! లిఙ్గం
తైజసమేతదిహాపి తవాంశః ।
వీతగుణస్య వినాతవయోగం
దేవి! శివస్యకుతః ఖలుతేజః॥ 15

ఓనగరాజనందినీ! 'కాంచి' మొదలగు పంచభూత క్షేత్రముల యందు – అరుణాచలమనునది – తైజసలింగమగుఁగాక! అరుణాచలమునందే కాక (గిరియందేగాక) యీ తైజసలింగము నందుఁగూడ – నీ భాగమున్నది. దేవీ పరబ్రహ్మ స్వరూపుఁడగుట వలన నిర్గుణుఁడగు శివునకు నీతోడి యోగము - (సంబంధము) లేని యెడల – తేజస్సెట్లు కలుగును?

ప్రభ :– భారతదేశమున –పృథివ్యాది భూతములయిదింటికిని సంబంధించిన క్షేత్రములయిదు గలవు. అందు దక్షిణదేశమునందున్న అరుణాచలము – తేజోమయమగుచున్నది. అరుణాచలమన – ఎఱ్ఱని కొండ. ఈ కొండకు క్రింది భాగమున అరుణాలేశ్వరాలయము గలదు. ఆ పర్వతము - పరమేశ్వర స్వరూపమే. దాని క్రిందనున్న యాలయమున, నున్న లింగము - పురాణములయందు తైజసలింగమని చెప్పఁబడుచున్నది. ఆ పర్వతమునందు మాత్రమేకాక – ఆ తైజసలింగమునందుఁగూడ – పరమేశ్వరి యంశము కలదని సమర్థించుచున్నాఁడు. నిర్గుణుఁడగు పరమపురుషునకు శక్తి యోగమువలననే సగుణత్వము కలుగును. తేజస్సు – గుణము. కావున – తైజ సమగులింగము - గుణి (గుణము గలది) యగును. గుణమగు తేజస్సు లేనియెడల – గుణియగు

లింగము తైజసము కానేరదు. ఇందలి గుణ – యోగ – తేజశ్శబ్దముల చేత – "స్పష్టపడని గుణము గల ద్రవ్య విశేషమునకు భైషజ్యయోగమున – తేజము (వీర్యము) కలుగును.'' అను భేషజార్థము స్ఫురింపఁజేఁబడుట వలన – ఉపమ ధ్వనించుచున్నది. 'తైజసలింగమునందలి యర్థభాగము – దేవీశరీరము' అనునంశ మిందు సమర్థనీయము. దీనిని – ఉత్తరార్థమునందలి వాక్యార్థముచేత – 'పరబ్రహ్మ' ఇత్యాదికముచేత సమర్థించుట వలన, నిది – కావ్యలింగాలంకార మగుచున్నది.

మూ॥ స్థాపితమూర్తిరియం తవనమ్యా
పూజయితుం జగదీశ్వరి! రమ్యా
శోణనగార్థమిదం తవ రూపం
కీర్తయితం నగజే! ధుతపాపమ్॥ 16

జగదీశ్వరీ! నమస్కరింపఁదగిన నీయీస్థాపితమూర్తి – అనఁగా శిల్పులచేత రచింపఁబడిన యీ ప్రతిమ – పూజించుటకు రమ్యమైయున్నది. పాపముల నూడ్చివైచునదియగు అరుణగిరియందలి యర్థభాగమగు నీరూపము – కీర్తించుటకు రమ్యమగుచున్నది.

ప్రభ:-కర – చరణాద్యవయవ సుందరమును, శిల్పికృతమును, అగునీమూర్తి కాయికపూజా విషయమును, పర్వతార్థమగు నీమూర్తి – వాచిక పూజా విషయమును అగుచు రమణీయకమైయున్నది – మానసపూజ – ఉభయత్ర గమ్యమగుచున్నది.

మూ॥ శోణనగార్థతనోఽ నిశమజ్కే
ధారయసేఽయి! గుహం రమణాఖ్యమ్।
ఆగతమప్యయి! హా! ముహురమ్బా
చ్చాటయసే గణపం ననుకస్మాత్॥ 17

అరుణాచలార్ధాంగీ! ఎల్లప్పుడును, గుహావతారుఁడగు రమణ మహర్షిని నీయంకమున ధరించుచున్నావు. అమ్మా! మాటిమాటికిని వచ్చుచున్నను గణపతిని ఏ కారణము చేతనో దూరము చేయుచున్నావు.

ప్రభ:- ''చిన్న కొడుకగు కుమారస్వామిని (రమణమహర్షిని) **తొడయందుది గూర్చుండఁజేసికొని లాలించుచున్నావు. పెద్దకొడుకగు గణపతిని (నన్ను) ఏల దూరీకరించెదవు'' అని యర్థము. భగవానుఁడగు రమణమహర్షి- అరుణాచలకటకము నధివశించియున్నాఁడు. (ఇప్పటికిని తత్పాదమును విడుచుట లేదు) ''గణపతి మునియో- అప్పడప్పడు (మాటి మాటికిని) అచ్చట నివసించుచుండెను.'' అని తాత్పర్యము.**

మూ॥ అఙ్కజుషే రమణాయ ను దాతుం
మానవ వేషధరాయ గుహాయ
శోణనగార్ధతనో బహుదుగ్ధం
మాతరపీతకుచేహ విభాతి॥ 18

అరుణగిరీశ్వరార్ధాంగివగు జననీ! మానవ వేషధరుఁడును, నీ యుత్సంగము నొందియున్నవాఁడును, గుహుఁడును (నీపుత్రుఁడును) అగు రమణునికి విస్తారమగు స్తన్యము నొసగుటకు ఈ క్షేత్రమునందు అపీతకుచవై వెలయుచున్నావు కాఁబోలును!

ప్రభ:- అపీతకుచయనఁగా పానము చేయఁబడని కుచములు గలది. అరుణాచలమునందున్న దేవీనామము – అపీతకుచాంబ.

మూ॥ పూర్ణసమాధివశాత్ స్వపిషిత్వం
పీతమపీతకుచేఽమ్బ! నవేత్సి।
అఙ్కజుషా రమణేన సుతేన
ప్రేక్ష్యయథేష్ట మురోరుహదుగ్ధమ్? 19

అమ్మా! సంపూర్ణ సమాధి వలన, (సకలమగు బాహ్య ప్రపంచమును గూడ విస్మరించిన దానివవలె) నిద్రించుచున్నావు. కావుననే, నీయంకమునందున్న పుత్రుఁడగు రమణుని చేత – భవదురోజదుగ్ధము (స్తన్యము) యథేష్టముగాఁ జూచి పానము చేయఁబడుటను తెలిసికొనకున్నావు.

మూ॥ జ్ఞాన రసాహ్వాయ మమ్బ! నిపీయ
స్తన్యమసౌ రమణో మునిరాట్తే
జ్ఞానమయోఽభవదీశ్వరి! సర్వః
పుష్యతి యేనతనుం హి తదాత్మా॥ 20

అమ్మా! ఈశ్వరీ! మునిరాట్టగు ఈ రమణుడు – జ్ఞానరసమను పేరుగల నీ స్తన్యమును మిక్కిలి త్రాగి – జ్ఞానమయుఁడై సర్వస్వరూపుఁడయ్యెను. కావున నే జ్ఞానరసాత్ముఁడై దేహమును పోషించుచున్నాడు.

మూ॥ ప్రీతిపదాయ పయోధరకుమ్భాత్
పార్వతి! ధీమయదుగ్ధమపీతాత్
అస్తుగుహాయశివే బహుదత్తం
కిఞ్చినివేశ్వరి! ధారయమహ్యమ్. 21

పార్వతీ! అపీతమగు (పానము చేయఁబడని) కుచకుంభము నుండి – బుద్ధిమయమగు (జ్ఞానరసమయమగు) దుగ్ధమును – ప్రేమాస్పదుఁడగు గుహుని కొఱకు (రమణుని కొఱకు) అమితముగా నిచ్చిన నిమ్ము. ఈశ్వరీ! నా కొఱకు స్వల్పముగా నైనను ప్రసాదింపుము.

ప్రభ:- నీ స్తన్యమును గుహునకు యథేష్టముగానిమ్ము. కాని నాకు స్వల్పముగానైననిమ్ము. ' ఇచ్చుటకుఁగాని, యీయకుండుటకుఁగాని, ప్రభ్వివి నీవే' యని సూచించుటకు – అమ్మాయని సంబోధింపక – ' ఈశ్వరి' అని సంబోధించెను. గ్రహించునది.

మూ॥ ప్రౌఢమిమం యది పేత్సి తనూజం
శైలసుతే! మదవారి దధానమ్।
మాస్తు పయో వితరానఘమన్నం
యేనదధాని మహేశ్వరి! శక్తిమ్॥ 22

శైలకుమారీ! గజముఖుఁడగుట వలన మదజలమును భరించుచున్న పుత్రుఁడగు ఈ గణపతిని ప్రౌఢునిగా (ప్రవృద్ధునిగా) తెలియుదు వేని స్తన్యము నీయవలదు. అనఘమును (దోషరహితమును) శ్రేయస్కరమును, అగు అన్నమునిమ్ము. మహేశ్వరీ! అయన్నము చేత నేను శక్తిగలవాఁడ నగుదును.

ప్రభ:- "వీఁడు – చంటిబిడ్డ కాఁడు. స్తన్యపానదశ నతిక్రమించి పెరిగిన యువకుఁడని తలంచిన యెడల శక్తిధారణ సామర్థ్యము నిచ్చునదియగు అన్నము నిమ్మని భావము.

మూ॥ స్వార్జితమేవ మయా యది భోజ్యమ్।
సమ్మద ఏవ మమాఖిలమాతః!
అశిషమగ్ర్యతమామయి దత్వా
ప్రేషయ యాని జయాని ధరిత్రీమ్. 23

విశ్వజననీ! నీవు స్వార్జితమేయగు నన్నమే భుజింపవలయునందువా? అదియు నాకు సమ్మదమేయగును. ఈలోకమునందు నాకు జయప్రదములును, శ్రేష్ఠతమములును, అగు ప్రాస్థానిక మంగళాశీర్వచనముల నొసఁగి నన్నుపంపుము.

మూ॥ విద్యుతి విద్యుతి వీక్ష్యవిలాసా
వీక్షితకర్మణి లక్ష్యరహస్యా।
పార్వణచన్ద్రముఖీ లలితాఙ్గీ
తైజ సలిఙ్గసఖీశరణం నః 24

ప్రతివిద్యుత్తునందును చూడఁదగిన విలాసము గలదియు, దర్శన కర్మయందు (చూచుటయను) వ్యాపారమునందు లక్షింపఁదగిన (సూక్ష్మముగాఁ దిలకించుటకుఁ దగిన) రహస్యము గలదియు, పూర్ణచంద్రముఖియు, లలితాంగియు, తైజసలింగమగు అరుణాచలేశ్వరుని ప్రేయసియు, అగు పరమేశ్వరి– నాకు శరణమగుచున్నది.

ప్రభ:- ఒక్కొక్క మెరుపునందును దేవీ విలాసమే కాన్పించును. ఆమెకు దృష్టియే – స్వరూపము. కావున దృశ్యము నుండి వేరొనర్చి – రహస్యమగు నామె స్వరూపమును గుర్తింపవలయును. పార్వణచంద్ర ముఖియు, లలితాంగియు, తైజసలింగ సఖియు, అగు నాజగన్మాతయే – నన్ను రక్షించునని భావము.

మూ॥ మాతరపీతకుచేఽరుణ శైలా
ధీశ్వరభామిని! భామహనీయే
సాధు విధాయ సమర్పయ తేతే
దోధకమాల్యమిదం గణనాథః 25

అరుణాచలేశ్వరభామినీ! ప్రభావమహనీయా! అంబా! అపీతకుచా! దోధకవృత్త గ్రథితమగు మాల్యమును (పుష్పమాలను) నిర్దుష్టమును, గుణశోభితమును అగునట్లు రచించి, గణపతి – నీకు సమర్పించుచున్నాఁడు. (అంగీకరింపుము)

ఇది – సవ్యాఖ్యమగు షడ్ వింశ స్తబకము.

****